ఇంద్రమ్మ ఇల్లుకు భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత బాల్ రెడ్డి

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని గ్రామపంచాయతీ, ఇంద్రమ్మ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత ఇంద్రమ్మ ఇల్లు లబ్ధిదారులైన ఎర్రగుళ్ల చెన్నమ్మ స్థలంలో ముగ్గు పోశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత బాల్ రెడ్డి మాట్లాడుతూ ఇండ్లు నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని, వారి సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలన్నారు. మిగతా 2 లో

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శుక్రవారం 30 అక్టోబర్ 2026 పేజీలు:13

పేద కుటుంబానికి అండగా - మంత్రి వాకిటి శ్రీహరి

- బాధితుడికి 10 లక్షల ఎల్ఓసి అందజేత

నర్వ అక్టోబర్ 29 ప్రజా జ్యోతి

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ శ్రీ వాకిటి శ్రీహరి చేతుల మీదుగా,నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ సహకారంతో.మక్తల్ నియోజకవర్గం: నర్వ మండలంలోని లంకాల గ్రామ నివాసి, మేస్త్రీ అంజన్న గారికి 10 లక్షల ఎలువోసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) అందజేయడం జరిగింది.ఆపదలో ఉన్న బాధిత కుటుంబానికి అండగా నిలిచి, మెరుగైన వైద్య చికిత్సకు సహకారం అందించిన తెలంగాణ రాష్ట్రం మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నగారికి, అలాగే ఈ ఎల్ ఓ సి మంజూరులో సహకరించి నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ గారికి, లంకల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు,లంకాల గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మిగతా 2 లో

యువత భవిష్యత్తుతో చెలగాటమాడితే కఠిన చర్యలు.!

- మాదకద్రవ్యాల కట్టడికి అధికార యంత్రాంగం అప్రమత్తం- జిల్లాలో 24 కేసులు నమోదు.. 32 మంది అరెస్టు
: ఎస్పీ జానకి- కళాశాలల్లో నిరంతర నిఘా, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

విద్యార్థులు, యువతను మాదక ద్రవ్యాల మహమ్మారి నుంచి కాపాడేందుకు అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు సమష్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. మిగతా 2 లో

భూ రీసర్వేతో భూహద్దుల వివాదాలకు చెక్.!

- ఆధునిక రోవర్ సాంకేతికతతో భూముల కొలతలు..
యజమానులకు ఎల్‌పీఎం మ్యాపులు, భూధార్ కార్డులు
- యారోనిపల్లిలో గ్రామస్థులకు అవగాహన కల్పించిన అదనపు కలెక్టర్ హరిప్రియ

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

భూముల హద్దులపై స్పష్టత తీసుకురావడంతో పాటు భవిష్యత్తులో భూ యాజమాన్య వివాదాలను నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న భూ రీసర్వే ప్రక్రియపై గ్రామస్థులు అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ సూచించారు. మిగతా 2 లో

యువత భవిష్యత్తుతో చెలగాటమాడితే కఠిన చర్యలు.!

మొదటిపేజీ తరువాయి

మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడం కేవలం అవగాహన కార్యక్రమాలకే పరిమితం కాకూడదని, వాటి వినియోగం, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, సరఫరా వనరులను గుర్తించి కట్టడి చేసేందుకు క్రియాశీలక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ దరావత్ జానకితో కలిసి మాదకద్రవ్యాల నివారణపై జిల్లా అధికారులు, కళాశాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు చేపడుతున్న చర్యలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు.

24 కేసులు.. 32 మంది అరెస్టు.!

జిల్లాలో మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసులపై ఎస్పీ జానకి కీలక వివరాలు వెల్లడించారు. ఇప్పటివరకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు సంబంధించి 24 కేసులు నమోదు చేసి, 32 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలకు సంబంధించిన సమాచారం పోలీసులకు అందించడంలో కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు మరింత చొరవ చూపాలని కోరారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నట్లు తెలిసినా, కళాశాలలు లేదా వసతి గృహాల పరిసరాల్లో వాటి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు. విద్యాసంస్థల పేరుప్రతిష్ఠలకు భంగం కలుగుతుందనే ఆందోళనతో సమస్యలను దాచిపెట్టకుండా, ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు.

కళాశాలల్లోనే నిరంతర అవగాహన

వైద్య, ఇంజినీరింగ్, విశ్వవిద్యాలయాలు, ఇతర వృత్తి విద్యా కళాశాలల్లో ప్రవేశ సమయంలో నిర్వహించే పరిచయ కార్యక్రమాల నుంచే మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం, చట్టపరమైన పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని

కలెక్టర్ సూచించారు. ప్రతి కళాశాలలో మాదకద్రవ్యాల నివారణ పోస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

విద్యార్థుల ప్రవర్తనలో అసాధారణ మార్పులు కనిపించినప్పుడు అధ్యాపకులు, వార్డెన్లు నిర్లక్ష్యం చేయకుండా తగిన శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అవసరమైన సందర్భాల్లో సంబంధిత విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, వ్యసన విముక్తి కేంద్రాలకు పంపించి చికిత్స, కౌన్సెలింగ్ అందించే చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామని, మరికొన్ని కేసుల్లో తదుపరి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

గంజాయితో పాటు ఇతర పదార్థాల దుర్వినియోగంపైనా నిఘా

గంజాయితో పాటు వైట్‌నర్, దగ్గు మందుల సిరప్‌లు, ఫెవికాల్ వంటి పదార్థాలను దుర్వినియోగం చేసే అవకాశాలపైనా విద్యాసంస్థలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. కొన్ని పదార్థాల దుర్వినియోగాన్ని సాధారణ మాదకద్రవ్య పరీక్షల ద్వారా గుర్తించడం కష్టమవుతుందని పేర్కొంటూ, విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను అధ్యాపకులు, వసతి గృహాల వార్డెన్లు గమనించాలని తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన సమస్యలను సున్నితంగా పరిష్కరిస్తూ, అవసరమైనప్పుడు వైద్య నిపుణుల సహకారంతో పరీక్షలు, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల సరఫరా, విక్రయాలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారాన్ని పోలీసులకు అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కళాశాలల పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలపై దృష్టి

తమ విద్యాసంస్థల్లో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కళాశాలల ప్రతినిధులు సమావేశంలో తెలిపారు. మరింత విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు పోలీసు, వైద్య, సంబంధిత శాఖల సహకారం అందించాలని కోరారు. విద్యాసంస్థల పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు నిర్వహించే దుకాణాలు, మత్తు పదార్థాల విక్రయాలకు సంబంధించిన వనరులపై నిఘా అవసరమని ప్రస్తావించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా, కళాశాలల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి పోలీసులకు అందించాలని సూచించారు. విద్యార్థులు కళాశాలలు, వసతి గృహాల్లో ఎక్కువ సమయం గడుపుతున్నందున అధ్యాపకులు వారి ప్రవర్తనను గమనిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు అందరి బాధ్యత

విద్యార్థులను తమ పిల్లలుగా భావించి సరైన మార్గంలో నడిపించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థుల ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం, భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని, అందువల్ల సమస్య తీవ్రరూపం దాల్చకముందే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు, వైద్య, విద్యాశాఖ అధికారులు, కళాశాలల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేస్తూ అవగాహన కల్పించడం, సమస్యలను గుర్తించడం, బాధిత విద్యార్థులకు తగిన వైద్య సహాయం అందించడం, మాదకద్రవ్యాల సరఫరా వనరులను అరికట్టడం వంటి చర్యలకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, కళాశాలల ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు, ఎన్‌జీవో ప్రతినిధులు, విద్యాశాఖ, వైద్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వేతో భూహద్దుల వివాదాలకు చెక్.!

మొదటిపేజీ తరువాయి

భూముల కొలతలను కచ్చితంగా నిర్వహించి, భూహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు ఆధునిక రోవర్ సర్వే సాంకేతికతను వినియోగించనున్నట్లు తెలిపారు.గురువారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం యారోనిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభ, అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని గ్రామస్థులకు భూ రీసర్వే ప్రక్రియపై వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ ప్రక్రియను చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఆధునిక సాంకేతికతతో భూముల కొలతలు

భూ రీసర్వేలో భాగంగా ఆధునిక రోవర్ సర్వే సాంకేతికతను ఉపయోగించి భూముల కొలతలను కచ్చితంగా నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ వివరించారు. తద్వారా భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, భూ రికార్డుల నిర్వహణలో కచ్చితత్వాన్ని పెంచేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

భూయజమానులకు ఎల్‌పీఎంలు, భూధార్ కార్డులు

రీసర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూయజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ (ఎల్‌పీఎంలు), భూధార్ కార్డులు జారీ చేయనున్నట్లు హరిప్రియ వెల్లడించారు. ఈ ప్రక్రియ ద్వారా భూముల వివరాలను క్రమబద్ధంగా నమోదు చేయడంతో పాటు, భూహద్దులపై స్పష్టత ఏర్పడుతుందని పేర్కొన్నారు. భూ యాజమాన్యం, సరిహద్దులకు సంబంధించిన సమస్యలు, వివాదాలను భవిష్యత్తులో నివారించేందుకు రీసర్వే దోహదపడుతుందని వివరించారు.

గ్రామస్థుల సందేహాలకు సమాధానాలు

కార్యక్రమంలో భూ రీసర్వేకు సంబంధించి గ్రామస్థులు అడిగిన ప్రశ్నలకు అదనపు కలెక్టర్ సమాధానాలు ఇచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు. సర్వే ప్రక్రియకు సంబంధించిన వివరాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తూ, భూయజమానులు తమ భూములకు సంబంధించిన సమాచారంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రీసర్వే ప్రక్రియ సజావుగా, సమర్థవంతంగా పూర్తయ్యేందుకు రెవెన్యూ, సర్వే బృందాలకు గ్రామస్థులు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ కోరారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ (ఎస్‌అండ్‌ఎల్‌ఆర్) ఏడీ, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, డిప్యూటీ ఐఓఎస్, మండల సర్వేయర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంద్రమ్మ ఇల్లుకు భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత బాల్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

ఇందిరమ్మ ఇళ్లను శాంక్షన్ చేసినటువంటి రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావుకి,రాష్ట్ర ప్రభుత్వానికి, ఇందిరమ్మ కమిటీ వారికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా చాలామంది అర్హులు ఉన్నారని వారందరికి కూడా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత బాల్ రెడ్డి, ఉపసర్పంచ్ వెంకటయ్య, మాజీ సర్పంచ్ కురుమయ్య, గ్రామ కార్యదర్శి కర్ణాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆశన్న,శేఖర్, స్వాములు, వార్డ్ మెంబర్స్ విజయ్ కుమార్ రెడ్డి, నరేష్, చంద్రయ్య, కుటుంబ సభ్యులు ఎర్రగుట్ల చెన్నమ్మ కురుమయ్య, గ్రామ నాయకులు దేవన్న పాల్గొన్నారు.

పేద కుటుంబానికి అండగా మంత్రి వాకిటి శ్రీహరి

మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో లంకల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వార్డు మెంబర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు,మరియు నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,పత్రికా మిత్రులు,కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది ప్రజల కష్టాల్లో తోడుగా ఉంటూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ.! అని తెలిపారు.

జాతీయ జర్నలిస్టుల పురస్కారం - 2026 అవార్డు అందుకున్న మీసాల ఎల్లేష్

అవార్డు రావడం పట్ల మరింత బాధ్యత పెరిగింది.

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.

జర్నలిస్టుల జాతీయ పురస్కారం అందుకోవడంపై మరింత బాధ్యత పెరిగిందని, జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతుగా కృషి చేస్తానని, మీసాల ఎల్లేష్ అన్నారు. గురువారం నెల్లూరు జిల్లాలోని ఎం.వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రదానం చేసిన జాతీయ జర్నలిస్టుల పురస్కారం--2026ను దళిత్ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల ఎల్లేష్ అందుకున్నారు. ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీల మోహన్ కృష్ణ, మాజీ డీఐజీ శ్రీనివాస్ చేతుల మీదుగా, మీసాల ఎల్లేష్ తో పాటు, దళిత జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్, ప్రధాన కార్యదర్శి అంకూర్ డేవిడ్, వర్కింగ్ కార్యదర్శి ధనుష్ లు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మీసాల ఎల్లేష్ మాట్లాడుతూ... జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు చేస్తున్నందుకు ఈ పురస్కారం లభించిందని తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం చేస్తున్న సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మాగనూరు మండలంలో నాలుగు వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మాగనూరు, అక్టోబర్ 29(ప్రజా జ్యోతి)

తెలంగాణ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మాగనూరు మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఉజ్జల్లి, బైరంపల్లి, నేరడగం దొడ్డి, నేరేడుగం గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు.తెలంగాణ ప్రభుత్వం సన్న రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించిందని, ఏ గ్రేడ్ వరికి రూ.2,961, ఇతర రకాల వరికి రూ.2,441 చొప్పున చెల్లిస్తుందని అధికారులు తెలిపారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ, వెలుగు సంఘాల అధికారులు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, సర్పంచులు, మార్కెట్ డైరెక్టర్లు శంకర్ లింగం, బాలప్ప, అశోక్ గౌడ్, రామకృష్ణ, నాగరాజ్, వెలుగు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో యువతలో ఐక్యత.. స్నేహభావం పెంపొందుతుంది!

- దసరా, గంగమ్మ జాతర సందర్భంగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

- ఎస్సై జె. నరేష్, ముంత మల్లయ్య యాదవ్‌కు ఘన సన్మానం

వీపనగండ్ల, ప్రజాజ్యోతి రిపోర్టర్:

దసరా పండుగ, గంగమ్మ జాతర సందర్భంగా అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. మండల కేంద్రంలోని బెక్కెం బాట రహదారిలో చర్చి సమీపంలోని క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌ను స్థానిక ఎస్సై జె. నరేష్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ముంత మల్లయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 32 జట్లు పాల్గొన్నాయి. దీంతో క్రీడా మైదానంలో సందడి నెలకొంది.ఈ సందర్భంగా ఎస్సై జె. నరేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడాస్ఫూర్తితో ఆటల పోటీలు నిర్వహించడం వల్ల వారిలో స్నేహభావం, ఐక్యత పెంపొందుతాయని అన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, సమయస్ఫూర్తిని పెంచుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, పరస్పర గౌరవంతో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఆటల సమయంలో ఎలాంటి గొడవలకు తావివ్వకుండా స్నేహపూర్వక వాతావరణంలో పోటీలను కొనసాగించాలని కోరారు.

టోర్నమెంట్‌కు సహకరించిన వారికి ఘన సన్మానం

అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ముంత మల్లయ్య యాదవ్‌ను, టోర్నమెంట్‌ను ప్రారంభించిన స్థానిక ఎస్సై జె. నరేష్‌ను అంబేద్కర్ యూత్ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వహణ ద్వారా యువతలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని క్రీడల్లో యువత రాణించేందుకు ఈ టోర్నమెంటు ఎంతగానో ద్రోహద పడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు మీసాల నాగరాజు పాము రాజశేఖర్ మీసాల శివ దయ్యపు కృష్ణ పాము నాగులు తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ రవి మృతికి డీసీసీ అధ్యక్షుడు అంగంపల్లి సంజీవ్ ముదిరాజ్ సంతాపం

- రవీంద్ర నగర్‌లో రవి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రవీంద్ర నగర్‌కు చెందిన మెకానిక్ రవి మృతి పట్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు అంగంపల్లి సంజీవ్ ముదిరాజ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రవి మరణవార్త తెలుసుకున్న ఆయన వెంటనే రవి నివాసానికి చేరుకుని, పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రవి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రవి మృతి ఆయన కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం రవి అంత్యక్రియల్లో పాల్గొని, ఆయనకు తుది వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. కలీమ్, బురెమోని చందు యాదవ్, అబ్రార్ హుస్సేన్, రాజేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొని రవికి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు..!

- బాలానగర్ ఫ్లైఓవర్ పనులకు డెడ్‌లైన్.. నవంబర్ 15లోగా ఒకవైపు ట్రాఫిక్ ప్రారంభం

- పెండింగ్ పనులపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆగ్రహం.. బైపాస్‌పై అక్రమ దుకాణాలకు నోటీసులు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు గుర్తించిన ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా చర్యలను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. పలుమార్లు గడువులు విధించినప్పటికీ పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, చిన్నచిన్న సమస్యలను సాకుగా చూపకుండా క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ దరావత్ జానకితో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో రహదారుల పనుల పురోగతి, ప్రమాదకర ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా చర్యలు, వివిధ శాఖల ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న పనులను కలెక్టర్ సమీక్షించారు.

బాలానగర్ ఫ్లైఓవర్‌కు గడువులు

బాలానగర్ జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ వద్ద నవంబర్ 15లోగా ఒకవైపు రహదారిపై ట్రాఫిక్ ప్రారంభించాలని, మరోవైపు రోడ్డు పనులను నవంబర్ 30లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే కాంక్రీట్ పనులు, కొంతమేర తారు పనులు పూర్తయ్యాయని, బిటుమెన్ కొరత కారణంగా డీబీఎం పనుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు వివరించారు. పనులు మరింత ఆలస్యం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలేపల్లి వద్ద పెండింగ్ పనులను నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని, రాజాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద పనులను నిర్దేశిత గడువులోగా ముగించాలని ఆదేశించారు. పనుల పురోగతిని రోజువారీగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ముదిరెడ్డిపల్లి వద్ద అండర్‌పాస్, ఇరువైపులా సర్వీసు రోడ్లు, అదనపు అండర్‌పాస్ నిర్మాణ ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. ఆలయ తరలింపు, ఆక్రమణల తొలగింపు, పరిహారం చెల్లింపులకు సంబంధించిన సమస్యలను తదుపరి సమావేశంలోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పరిహారం చెక్కుల చెల్లింపుల్లో

ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించాలని, ఆలయ తరలింపునకు అవసరమైన అంచనాలను రూపొందించి సంబంధిత వర్గాలతో చర్చించాలని సూచించారు. జడ్చర్ల బస్టాండ్ సమీపంలో రహదారి భద్రతకు అవసరమైన మార్పులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని, దేవరకద్ర రహదారిలో ట్రాక్టర్ షోరూమ్ సమీపంలో, బండమీదిపల్లి వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూత్పూర్ నుంచి దిమిటిపల్లి మీదుగా ఫ్లైఓవర్ వరకు ఉన్న రహదారిపై ఇటీవల ఆరు ప్రమాదాలు జరిగినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రహదారులపై డివైడర్లు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలకు సంబంధించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

బైపాస్‌పై అక్రమ దుకాణాలకు నోటీసులు

మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డు పరిసరాల్లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాత్రివేళ ప్రమాదాలను నివారించేందుకు పోలీసు, మున్సిపల్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బైపాస్ రోడ్డుపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాత్రి పర్యవేక్షణను పెంచాలని పోలీసు అధికారులకు, అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

వాహన తనిఖీలపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

రవాణా శాఖ అధికారులు ప్రతి నెల నిర్వహిస్తున్న వాహన తనిఖీల వివరాలను తదుపరి సమావేశంలో సమగ్రంగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీ చేసిన వాహనాల సంఖ్య, నమోదు చేసిన కేసులు, అవసరమైన ధ్రువపత్రాలు లేని వాహనాలపై తీసుకున్న చర్యలు, విధించిన జరిమానాల వివరాలను నివేదికలో పొందుపరచాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించేలా అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల సహాయం

రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి రాహత్ పథకం కింద అర్హులైన ప్రమాద బాధితులకు రూ. 1.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందే ప్రక్రియలో ప్రమాదం జరిగిన 24 గంటల్లోగా సమాచారం అందించడం, బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించడం కీలకమని వివరించారు. 108 అత్యవసర సేవల సిబ్బంది ప్రమాద బాధితుల వివరాలను వెంటనే సంబంధిత అధికారులకు అందించేలా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన చిన్న సమస్యలను సైతం నిర్లక్ష్యం చేయరాదని, ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడమే ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్ పనులను తదుపరి సమావేశంలోగా పరిష్కరించి, పురోగతి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూధన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల శాఖ, పోలీసు, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గద్వాల డిపో నూతన మేనేజర్‌కు టి డబ్ల్యూ యు కమిటీ ఘన సత్కారం

గద్వాల అక్టోబర్ 29(ప్రజా జ్యోతి ప్రతినిధి):

గద్వాల ఆర్టీసీ డిపోకు నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రవణ్ కుమార్‌ను తెలంగాణ వర్కర్స్ యూనియన్ గద్వాల డిపో కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరిం చారు.ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి,శాలువాతో సన్మానించారు. అనంతరం కమిటీ సభ్యులు తమను పరిచయం చేసుకుని,డిపోకు సంబంధించిన అంశాలపై ఆయనతో ఆత్మీయంగా చర్చించారు.ఈ సందర్భంగా డిపోలో నెలకొన్న సమస్యలు, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మేనేజర్ శ్రవణ్ కుమార్ యూనియన్ నాయకులను అడిగి తెలుసుకున్నారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.డిపో అభివృద్ధికి,విధుల నిర్వహణకు యూనియన్ నాయకులు కూడా సహకరించాలని కోరారు.నూతన డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించడం పట్ల టి డబ్ల్యూ యు డిపో కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో సమన్వయంతో పనిచేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

పోక్సో చట్టం పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

- అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీనిధి

నాగర్ కర్నూల్ : అక్టోబర్ 28 (ప్రజా జ్యోతి)

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో గురు వారం తాడూరు మండల కేంద్రంలోని కే.జి.బి.వి పాఠశాలలో సురక్షిత్ బచ్ పన్ అభియాన్ - ఏ పాన్ ఇండియా స్కూల్ అవేర్నెస్ క్యాంపెయిన్ గురించి విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించా రు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెండవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎన్.శ్రీ నిధి హాజరై మాట్లాడుతూ సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ అనేది భారతదేశంలో పిల్లలరక్షణ,హక్కులు మరియు వారి భద్రతను పెంపొందించేందుకు ఉద్దేశించిన ఒక ముఖ్యమైన కార్యక్రమని అన్నారు.06 నుంచి 14, సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న బాల బాలికలు తప్పనిసరిగా పాఠశాలకు వెళ్ళి చదువుకోవాలని, చిన్నారులపై జరిగే లైంగిక దాడులు,వేధింపులను అడ్డుకోనేందుకు ఏర్పాటైన పోక్సో చట్టం పై పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉదేశ్యమని ప్రతి బిడ్డ స్వేచ్ఛగా చదువుకునే,ఆడుకునే సురక్షితమైన వాతావరణాన్ని అందించ డం పాఠశాల విద్యార్థులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు.అనంతరం బాలల రక్షణకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీరామ్ ఆర్య,శ్రీశైలం గౌడ్,జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధి కారి, ప్రధానో పాధ్యాయురాలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే - చిక్కుడు వంశీకృష్ణ

వంగూర్ అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి)

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూర్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షులు, జెడ్పీటీసీ అధ్యక్షులు , అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, వంగూర్ మండల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎల్ నినో ప్రభావం, వాతావరణ మార్పులు, వర్షపాతం, వ్యవసాయ రంగంపై ప్రభావం వంటి అంశాలపై చర్చించారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, వ్యవసాయ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాలలను పనుల్లో పెట్టుకుంటే రెండేళ్ల వరకు జైలు శిక్ష రూ.50 వేల వరకు జరిమానా: అసిస్టెంట్ కమిషనర్ బి.వేణుగోపాల్

- మల్దకల్‌లో 14 మంది బాల కార్మికులకు విముక్తి

- ముగ్గురు యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ

మల్దకల్ అక్టోబర్ 29(ప్రజా జ్యోతి ప్రతినిధి):

మల్దకల్ మండలంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 14 మంది బాల కార్మికులను గుర్తించి,వారిని రక్షించినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బి.వేణుగోపాల్ తెలిపారు.పత్తి విత్తనాల పొలాల్లో పనుల కోసం మూడు వాహనాల్లో బాలలను తరలిస్తున్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు.రక్షించిన బాలల్లో నెతోనిపల్లికి చెందిన ఎనిమిది మంది,ఆలూరుకు చెందిన ముగ్గురు,పెద్దొడ్డికి చెందిన ఇద్దరు,అరగిద్దకు చెందిన ఒకరు ఉన్నారు.ఈ ఘటనకు సంబంధించి అరగిద్ద ఆంజనేయులు (రాయపురం),కురువ వీరేష్ (పెద్దెడ్డి), జమ్మన్నలపై విచారణ చేపట్టి,ముగ్గురు యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.రక్షించిన బాలలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ముందు హాజరుపరిచి,కౌన్సెలింగ్ అనంతరం చైల్డ్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు. బాల కార్మిక నిషేధం,నియంత్రణ చట్టం--1986 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన యజమానులకు ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. విచారణ ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు పంపకుండా,విద్యను అభ్యసించేలా చూడాలని వేణుగోపాల్ కోరారు.బాలల హక్కులు,భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఎక్కడైనా బాలలను పనుల్లో పెట్టుకున్నా,పని కోసం తరలిస్తున్నట్లు గుర్తించినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు.ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో కార్మిక శాఖ సీనియర్ అసిస్టెంట్ అబ్రహం,జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది,స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిగట్లలో పారిశుద్ధ్యానికి కొత్త బాట!

- డ్రైన్ ఎండ్ సోక్ పిట్ నిర్మాణం పూర్తి..

గ్రామ పంచాయతీ కృషిపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా అభినందనలు

- సర్పంచ్ నతీ సురేష్ ఆధ్వర్యంలో మురుగునీటి సమస్య పరిష్కారానికి ముందడుగు

మహబూబ్‌నగర్ అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామ పంచాయతీ కీలక ముందడుగు వేసింది. గ్రామంలో చేపట్టిన డ్రైన్ ఎండ్ సోక్ పిట్ నిర్మాణం విజయవంతంగా పూర్తయింది. ఈ పనులపై జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా హర్షం వ్యక్తం చేస్తూ, గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, మండల బృందాన్ని అభినందించారు.గ్రామంలో మురుగునీటి నిర్వహణను మెరుగుపరచడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం లక్ష్యంగా చేపట్టిన ఈ నిర్మాణం పారిశుద్ధ్య పరిరక్షణలో ఉపయోగకరమైన ముందడుగుగా నిలిచింది. గ్రామ సర్పంచ్ నతీ సురేష్ ఆధ్వర్యంలో, మండల బృందం సహకారంతో పనులు పూర్తయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన నిర్వహణ చర్యలు చేపట్టడం ద్వారా పరిసరాల పరిశుభ్రతను కాపాడటంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు దోహదపడవచ్చు. ఈ నేపథ్యంలో మద్దిగట్ల గ్రామ పంచాయతీ చేపట్టిన డ్రైన్ ఎండ్ సోక్ పిట్ నిర్మాణం ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నతీ సురేష్ మాట్లాడుతూ, మద్దిగట్ల గ్రామాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణంతో తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి ప్రోత్సహించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పనుల పూర్తికి సహకరించిన మండల బృందం, సంబంధిత అధికారులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. స్వచ్ఛ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ, భవిష్యత్తులోనూ మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందరి సమన్వయంతో చేపడతామని

పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టి కృషి అవసరం

గ్రామాల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, ప్రజల భాగస్వామ్యం కీలకమని ఈ కార్యక్రమం తెలియజేస్తోంది. నిర్మాణం పూర్తయిన అనంతరం సోక్ పిట్ నిర్వహణను సక్రమంగా కొనసాగించడం, మురుగునీటి పారుదల వ్యవస్థను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా ఈ కార్యక్రమం ఆశించిన ప్రయోజనాలను అందించగలదు. మద్దిగట్లలో చేపట్టిన ఈ పారిశుద్ధ్య కార్యక్రమం గ్రామ పరిసరాల పరిశుభ్రతకు తోడ్పడటంతో పాటు, గ్రామాభివృద్ధి దిశగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు.

71 ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు.. ఇంకా ఎప్పటికి అందుతాయి.?

- మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందించాలని ఆదేశం

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (సాక్ష్యం బ్యూరో):
సొంతింటి కలతో ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందుబాటులోకి తీసుకురావడంలో ఇక జాప్యం జరగకూడదని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని 71 ప్రాంతాల్లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల పరిస్థితి, మిగిలిపోయిన పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఆయా కాలనీల్లో ఇంకా పూర్తి కావాల్సిన పనులను గుర్తించి యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సూచించారు.

మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో నివాసానికి అవసరమైన కనీస సదుపాయాలు కల్పించడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు.

ముఖ్యంగా తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థ, విద్యుత్ సౌకర్యాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రతి కాలనీలో చేపట్టాల్సిన పనుల వివరాలను పరిశీలిస్తూ, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. పనుల పూర్తికి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. నిర్దేశిత గడువులోగా అన్ని పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.

పనులు పూర్తయిన తర్వాతే లబ్ధిదారులకు అందజేత

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంతో పాటు వాటిలో నివసించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై కూడా అధికారులు సమాన శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్ పనుల కారణంగా ఇళ్ల వినియోగంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అవసరమైన సదుపాయాలన్నీ కల్పించిన అనంతరం ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పేద కుటుంబాలకు సొంతింటి సౌకర్యం కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే నిర్మాణ పనులతో పాటు మౌలిక సదుపాయాల పనులు కూడా పూర్తిస్థాయిలో ముగియాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి, ఆ శాఖ డిప్యూటీ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు.!

- పోల్కంపల్లిలో ప్రత్యేక అధికారి గంప శ్రీనివాస్ విస్తృత తనిఖీలు

- పాఠశాలలు, అంగన్‌వాడీల్లో సౌకర్యాల పరిశీలన..

చెత్త తొలగింపు, డ్రైనేజీ శుభ్రత వేగవంతం చేయాలని ఆదేశం

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):
గ్రామాభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మూసాపేట మండల ప్రత్యేక అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి గంప శ్రీనివాస్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.గురువారం ఆయన మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామంలో పర్యటించి గ్రామపంచాయతీ కార్యాలయం, ప్రాథమికోన్నత పాఠశాల, రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆయా సంస్థల్లో రికార్డుల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు.

పంచాయతీ రికార్డుల నిర్వహణపై ఆరా

గ్రామపంచాయతీ కార్యాలయంలో హాజరు, మూవ్‌మెంట్ రిజిస్టర్లతో పాటు ఇతర రికార్డులను పరిశీలించిన ప్రత్యేక అధికారి, పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామాభివృద్ధి పనుల పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యత తనిఖీ

గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన గంప శ్రీనివాస్ తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిమాణాన్ని తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల హాజరు, వారికి అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. కేంద్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అనే అంశంపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించి మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేక భోజనశాల నిర్మించాల్సిన అవసరాన్ని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చారు.

డ్రైనేజీ శుభ్రత పనులు వేగవంతం చేయాలి

గ్రామంలోని వివిధ కాలనీలు, ఆవాస ప్రాంతాల్లో పర్యటించిన ప్రత్యేక అధికారి పారిశుద్ధ్య పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రైనేజీ కాలువల శుభ్రత పనులు కొనసాగుతున్న తీరును గమనించారు.చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, మురుగునీటి కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.గ్రామపంచాయతీ పాలన, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణతో పాటు పారిశుద్ధ్య పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా సంబంధిత సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ప్రత్యేక అధికారి గంప శ్రీనివాస్ సూచించారు.

విద్యార్థుల శాస్త్రీయ ప్రతిభకు వేదికగా జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్.!

- 80 పాఠశాలల నుంచి వినూత్న ప్రదర్శనలు.. రాష్ట్రస్థాయికి ఐదు ప్రాజెక్టులు ఎంపిక

- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి: ఏఎంఓ దుంకుడు శ్రీనివాసులు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని, సృజనాత్మకతను, సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంపొందించేందుకు నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ ఎంతగానో దోహదపడుతుందని ఏఎంఓ దుంకుడు శ్రీనివాసులు అన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, సమాజంలో ఎదురయ్యే సమస్యలను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి పరిష్కార మార్గాలను అన్వేషించేలా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. మహబూబ్‌నగర్‌లోని ఎంజీ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 32వ జిల్లా స్థాయి నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని 80 పాఠశాలలు ఈ కార్యక్రమానికి రిజిస్ట్రేషన్ చేసుకుని పాల్గొన్నాయి. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలు, శాస్త్రీయ పరిశీలనలు, ప్రాజెక్టులతో ప్రతిభను చాటుకున్నారు.

శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలి

ఈ సందర్భంగా ఏఎంఓ దుంకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలు, తార్కిక ఆలోచన, పరిశోధనాత్మక దృక్పథం అభివృద్ధి చెందేలా ఉపాధ్యాయులు బోధనా పద్ధతులను అనుసరించాలని పేర్కొన్నారు. విద్యార్థులు సమస్యలను గుర్తించడం, వాటికి కారణాలను విశ్లేషించడం, ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను

రూపొందించడం నేర్చుకోవాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి షంషేర్ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి నామినేట్ చేయనున్నట్లు తెలిపారు. నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్‌తో పాటు సైన్స్ ఉపాధ్యాయులు సేవ్ ఫస్ట్ ఇన్నోవేషన్, ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్, తెలంగాణ స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ వంటి సైన్స్ సంబంధిత కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ఐదు ప్రదర్శనలు

జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శనలతో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు:

1. మధుమతి --- నిజాలపూర్ పాఠశాల
2. శివకుమార్ --- జెడ్పీహెచ్ఎస్, నవాబ్‌పేట్
3. హర్షిత --- స్మార్ట్ వండర్ స్కూల్
4. సౌమ్య --- జెడ్పీహెచ్ఎస్, భూత్పూర్
5. దేవిశ్రీ --- శ్లోక స్కూల్

ఈ విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలోనూ తమ ప్రతిభను చాటాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

నిపుణుల పర్యవేక్షణలో ప్రదర్శనల పరిశీలన

ఈ కార్యక్రమానికి పాలమూరు విశ్వవిద్యాలయం జువాలజీ విభాగానికి చెందిన డాక్టర్ ప్రొఫెసర్ రాజశేఖర్, బషీర్ అహ్మద్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించి, వారి ఆలోచనలు, ప్రాజెక్టుల ప్రాధాన్యాన్ని అంచనా వేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ ప్రతిభను వెలికితీయడంతో పాటు, పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, జిల్లా ఎన్ఎస్ఎస్‌సీ అసిస్టెంట్ కోఆర్డినేటర్ కె. శ్రీనివాసులు, సైన్స్ ఫోరమ్ అధ్యక్షురాలు పద్మావతి, కలాం డ్రీమ్ ఫోర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు టి.ఎన్. శ్రీధర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాకలి నిరంజన్ కుటుంబానికి గ్రామస్తుల అండ

రాజకీయ నాయకులు, యువకులు, ఉద్యోగులు, గ్రామస్తుల ఐక్యంతో లక్ష రూపాయలకు పైగా ఆర్థిక సాయం.అనారోగ్యంతో బాధపడుతున్న భార్య చికిత్స ఖర్చులు, పిల్లల చదువుల బాధ్యతను స్వీకరించిన జంగం శ్రీనివాసులు బ్రదర్స్

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.

మండల పరిధిలోని పుల్గర్ చర్ల గ్రామానికి చెందిన సాకలి నిరంజన్ అకాల మరణంతో విషాదంలో మునిగిన కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచారు. నిరంజన్ మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడంతోపాటు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితిని గుర్తించిన గ్రామస్తులు, రాజకీయ నాయకులు, యువకులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ సంఘాల ప్రతినిధులు మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. గ్రామంలోని పలువురు దాతలు, గ్రామస్తుల సహకారంతో లక్ష రూపాయలకు పైగా ఆర్థిక సాయం అందించి బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు.నాగర్ల రఘునాథ్ రెడ్డి రూ.5,000, బాల నారాయణ రూ.5,000, జంగం శ్రీనివాసులు బ్రదర్స్ రూ.10,000, అమాలి సంఘం రూ.10,000, పోచమ్మని శ్రీనివాసులు, సుధాకర్ రూ.లు 5000 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. వీరితోపాటు గ్రామంలోని పలువురు తమకు తోచిన విధంగా విరాళాలు అందించి నిరంజన్ కుటుంబానికి అండగా నిలిచారు. నాగర్ల రఘునాథ్ రెడ్డి సూచనల మేరకు బత్తుల గోపాల్, గుర్క మద్దిలేటి, బిజ్జ నరేష్, మల్లెపూల గోపాలకృష్ణ, మధుగం సుభాష్, అలకుంట వడ్డె రాజు, గుర్క కురుమయ్య, పింజారి సుభాన్ తదితరులు సమన్వయంతో ఆర్థిక సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పలువురు నాయకులు, దాతల సహకారంతో పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం సేకరించి బాధిత

కుటుంబానికి అందజేశారు.జంగం శ్రీనివాసులు, బ్రదర్స్ నిరంజన్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న నిరంజన్ భార్య చికిత్సకు అయ్యే ఖర్చులన్నింటినీ తామే భరిస్తామని, నిరంజన్ పిల్లల చదువులకు అయ్యే ఖర్చులను కూడా పూర్తిగా తామే చూసుకుంటామని హామీ ఇచ్చారు. వారి ప్రకటన బాధిత కుటుంబానికి కొంతమేరకు ధైర్యాన్ని, భరోసాను కల్పించింది.అదే గ్రామంలో రెండు రోజుల క్రితం బిజ్జ కుమార్ కుమారుడి అకాల మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసిన దాతలు, ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.5,000 ఆర్థిక సాయం అందించారు. బిజ్జ కుమార్ నాగర్ల రఘునాద్ రెడ్డి 5000/-

రూపాయలు ఆర్థిక సహాయం అందించారు, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు, ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొందరు యువకులు మాట్లాడుతూ. అకాల మరణాలతో కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో గ్రామమంతా ఏకమై బాధిత కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. కష్టకాలంలో ఒకరికొకరు తోడుగా నిలవడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ గ్రామంలో ఇలాంటి ఆపదలు ఎదురైనప్పుడు బాధిత కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇదేవిధంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్తులు, దాతలు, యువకులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు, సంఘాల ప్రతినిధుల సేవాభావాన్ని పలువురు అభినందించారు. గ్రామ ఐక్యత, మానవత్వం, పరస్పర సహకారానికి ఈ ఆర్థిక సాయం నిదర్శనంగా నిలిచింది.

"ఐదేళ్లు గడిచినా.. అమ్మ జ్ఞాపకాలు పదిలం..! తల్లిదండ్రుల విగ్రహాలకు మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ భావోద్వేగ నివాళి"

- తల్లి శాంతమ్మ ఐదో వర్ధంతి సందర్భంగా

తల్లిదండ్రుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

అమ్మ ప్రేమకు కాలంతో పనిలేదు.. ఆమె భౌతికంగా దూరమైనా జ్ఞాపకాలు మాత్రం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. కన్నతల్లి చూపిన ఆప్యాయత, నేర్పిన విలువలు, అందించిన ఆశీస్సులు జీవితాంతం మనిషికి కొండంత అండగా నిలుస్తాయి. అలాంటి మాతృమమకారాన్ని స్మరించుకుంటూ మాజీ మంత్రి డాక్టర్ విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ తన తల్లి విరుసనోళ్ల శాంతమ్మ ఐదో వర్ధంతి సందర్భంగా భావోద్వేగంతో నివాళులర్పించారు.తల్లి శాంతమ్మ ఐదో వర్ధంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి తన తల్లిదండ్రులు శాంతమ్మ, నారాయణ గౌడ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తల్లిదండ్రుల జ్ఞాపకాలను స్మరించుకుంటూ వారి పట్ల తనకున్న గౌరవం, ప్రేమను చాటుకున్నారు.

తల్లిదండ్రుల జ్ఞాపకాలు.. జీవితానికి వెలుగులు

తల్లిదండ్రులు మనకు జన్మనివ్వడమే కాకుండా జీవితంలో ఎలా ముందుకు సాగాలో నేర్పిస్తారు. వారి త్యాగాలు, కష్టాలు, ప్రేమానురాగాలే పిల్లల ఎదుగుదలకు పునాదులవుతాయి. కాలం గడిచినా వారు అందించిన విలువలు, జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ చెరిగిపోవు. తల్లి ఐదో వర్ధంతి సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ నివాళులర్పించడం తల్లిదండ్రుల పట్ల ఆయనకున్న అనుబంధాన్ని గుర్తుచేసింది. తల్లిదండ్రుల ఆశీస్సులు, కుటుంబ అనుబంధాలు జీవితంలో ఎంతో విలువైనవని చాటిచెప్పే ఈ సందర్భం భావోద్వేగానికి ప్రతీకగా నిలిచింది. కన్నవారిని స్మరించుకోవడం, వారు చూపిన మార్గాన్ని గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరికీ మానవీయ విలువలను గుర్తుచేస్తుంది. తల్లిదండ్రుల భౌతిక ఉనికి లేకపోయినా, వారు అందించిన ప్రేమ, నేర్పిన సంస్కారం, మిగిల్చిన జ్ఞాపకాలు కుటుంబ సభ్యుల హృదయాల్లో ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.

పేదింటి ఆడబిడ్డల చదువుకు రూ.40 కోట్ల భరోసా.!

- వీరన్నపేటలో రెండు మైనారిటీ బాలికల గురుకులాలకు శంకుస్థాపన

రెండేళ్లలో అత్యాధునిక భవనాలు, వసతి గృహాలు అందుబాటులోకి తెస్తాం

- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

పేద కుటుంబాల ఆడబిడ్డలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా మహబూబ్‌నగర్ నగరంలోని వీరన్నపేటలో రూ.40 కోట్ల అంచనా వ్యయంతో రెండు మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. విద్య, వసతి సౌకర్యాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అత్యాధునిక విద్యాసంస్థలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పేద విద్యార్థినుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వీరన్నపేటలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో గురువారం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి కృషితోనే మైనారిటీ బాలికల పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

పెండింగ్ ప్రాజెక్టుకు మళ్లీ జీవం

గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలల నిర్మాణ ప్రాజెక్టును తిరిగి ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాను సమకూర్చడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చినట్లు వివరించారు.పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, రెండేళ్లలోపు అత్యాధునిక భవనాలు, వసతి గృహాలను నిర్మించి అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని వెల్లడించారు. ఒక్కో పాఠశాలలో సుమారు 600 మంది చొప్పున మొత్తం 1,200 మంది బాలికలకు నాణ్యమైన విద్య అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు.

కూలీల పిల్లలకూ కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు

విద్యావకాశాలు ఆర్థిక స్థోమత ఉన్న కుటుంబాల పిల్లలకే పరిమితం కాకూడదని యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కూలీలు, రిక్షా, ఆటో డ్రైవర్లు, మెకానిక్‌లు, వ్యవసాయ కూలీలు, దుకాణాల్లో పనిచేసే ఉద్యోగుల కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా అత్యుత్తమ విద్యా సౌకర్యాలను పొందాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను చేరువ చేయాలనే ఉద్దేశంతో వీరన్నపేటలో విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పాఠశాలలు ప్రధాన రహదారులపై కనిపించడం కంటే, అవసరమైన విద్యార్థులకు చేరువలో ఉండి వారి భవిష్యత్తును తీర్చిదిద్దడం ముఖ్యమని అన్నారు. ఆధునిక భవనాలు, మెరుగైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి వస్తే స్థానిక తల్లిదండ్రుల్లో తమ పిల్లలను ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థల్లో చదివించాలనే విశ్వాసం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అన్ని వర్గాల పిల్లల కోసం సమీకృత గురుకుల పాఠశాల

మైనారిటీ బాలికల కోసం రెండు గురుకుల పాఠశాలల నిర్మాణంతో

పాటు, అన్ని వర్గాల పిల్లలకు విద్యావకాశాలు కల్పించేలా మరో సమీకృత గురుకుల పాఠశాల (ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్) ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ విద్యాసంస్థలు పూర్తయితే వీరన్నపేట ప్రాంతం విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. నాణ్యమైన విద్య ద్వారా పేద కుటుంబాల పిల్లలకు మెరుగైన భవిష్యత్తు అందించడంతో పాటు, స్థానికంగా అభివృద్ధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వీరన్నపేట మహబూబ్‌నగర్ నగరంలో ప్రముఖ విద్యా కేంద్రంగా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, సురక్షితమైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి రావడం వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులను అధిగమించేందుకు తోడ్పడుతుందని ఈ సందర్భంగా వక్తలు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా బాలికలకు విద్యావకాశాలు పెరగడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం, స్వావలంబనకు బాటలు పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, నగర మేయర్ గుమ్మాల మమత, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర కార్పొరేటర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చని తెలంగాణను కరువు కోరల్లోకి నెట్టారు...?

- పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి చలనం లేదా.? రైతుల కన్నీళ్లకు ఎవరు బాధ్యులు.?

- వేపూర్‌లో ఎండిన పంటలను పరిశీలించిన మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్..

ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

ఒకవైపు ఎండుతున్న పంటలు.. మరోవైపు పెరుగుతున్న అప్పులు.. ఇంకోవైపు బతుకుదెరువు కోసం వలసబాట పడుతున్న రైతులు, వ్యవసాయ కూలీలు.! అన్నదాతను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పచ్చగా ఉండాల్సిన పల్లెల్లో పంటలు ఎండిపోతుంటే, రైతుల కష్టాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హన్వాడ మండలం వేపూర్ గ్రామంలో ఎండిపోయిన పంటలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. పెట్టుబడుల కోసం అప్పులు చేసి సాగు చేపట్టిన రైతులు, పంటలు చేతికి రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులను తక్షణమే ఆదుకునేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పంటలు ఎండుతున్నాయి.. రైతులు వలసబాట పడుతున్నారు.!

రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గ్రామాల్లో మళ్లీ వలసల పరిస్థితులు కనిపిస్తున్నాయని, తట్టా పారా చేతబట్టి బతుకుదెరువు కోసం ముంబై బస్సులు ఎక్కాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబాలకు తినడానికి తిండి కూడా కష్టమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శించారు.రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తే, నీటి కొరతతో అవి ఎండిపోవడం వారి కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతోందని అన్నారు. వ్యవసాయ కూలీలకు పనులు లేకపోవడం, పశువులకు మేత, నీరు అందకపోవడం గ్రామీణ జీవనాన్ని మరింత సంక్లిష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో పశువులను అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు.

నీటి నిర్వహణపై ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి

నీటి వనరుల వినియోగం, సాగునీటి సరఫరాపై ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సి ఉందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటిని విడుదల చేస్తున్నారన్న అంశాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటిని వినియోగించుకునే అవకాశాలపై ప్రభుత్వం ఎందుకు సమగ్రంగా ఆలోచించడం లేదని ప్రశ్నించారు.తన వ్యాఖ్యల్లో 60 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లను నింపే అంశాన్ని ప్రస్తావించిన ఆయన, జూరాల ప్రాజెక్టు పరిధిలోనూ రైతులకు సాగునీరు అందించడంపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. నీటి లభ్యత, ప్రాజెక్టుల నిర్వహణ, సాగునీటి పంపిణీపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు రైతులు పంటలు వేయవద్దని చెబుతూ, మరోవైపు నీటి వినియోగంపై ప్రత్యామ్నాయ ప్రణాళికలు ప్రకటించకపోవడం రైతుల్లో ఆందోళన పెంచుతోందని అన్నారు. రాష్ట్రంలో సాగునీటి నిర్వహణపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహించి, రైతులకు భరోసా కల్పించాలని కోరారు.

ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి

ఎండిపోయిన పంటలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి పంట నష్టాన్ని అంచనా వేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.రైతు భరోసా వంటి ఆర్థిక సహాయ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వడంతో పాటు వ్యవసాయ కూలీలకు కూడా తగిన సహాయం అందించాలని సూచించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు కల్పించడం, అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా చేయడం, సాగునీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఇప్పటికే ఎండిపోయిన పంటలతో రైతులు నష్టపోయినప్పటికీ, ఇంకా మిగిలి ఉన్న పంటలైనా కాపాడేందుకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. పశు వులకు పశుగ్రాసం, తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. తాగునీటి సమస్య తీవ్రం కాకముందే ముందస్తు చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా

ప్రణాళిక రూపొందించాలని సూచించారు.జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, క్షేత్రస్థాయి నివేదికలను ప్రభుత్వానికి అందించి తక్షణ సహాయక చర్యలకు కృషి చేయాలని కోరారు. రైతుల సమస్యలను పక్కనపెట్టి తప్పుడు ప్రచారాలకు ప్రాధాన్యం ఇస్తే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

ప్రభుత్వం స్పందించాలి.. రైతులకు భరోసా కల్పించాలి

రైతుల కష్టాలను రాజకీయ విమర్శలకే పరిమితం చేయకుండా, నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించడం, సాగునీటి సమస్యను పరిష్కరించడం, పశువులకు మేత, నీరు కల్పించడం, వ్యవసాయ కూలీలకు ఉపాధి అవకాశాలు పెంచడం వంటి తక్షణ చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు. రైతు బతికితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బతుకుతుందని, అన్నదాతను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో హన్వాడ మాజీ ఎంపీపీ బాలరాజు, మాజీ జడ్పీటీసీ నరేందర్, హన్వాడ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణయ్య గౌడ్, సీనియర్ నాయకులు బసిరెడ్డి, శ్రీనివాసులు, జంబులయ్య, చెన్నయ్య, ఖాజా గౌడ్, ఆనంద్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులోనే మెరుగైన వైద్యం.. రోగుల ముఖాల్లో "చిరునవ్వు"లే లక్ష్యం.!

- న్యూటౌన్‌లో 'చిరునవ్వు డెంటల్ హాస్పిటల్' ప్రారంభం

- నాణ్యమైన దంత వైద్య సేవలతో ప్రజలకు భరోసా కల్పించాలి: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):
వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా మహబూబ్‌నగర్‌లోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వైద్య సేవల కోసం ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందిస్తూ, వారి ముఖాల్లో చిరునవ్వులు నింపేలా వైద్యులు సేవలందించాలని సూచించారు. మహబూబ్‌నగర్ నగరంలోని న్యూటౌన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'చిరునవ్వు డెంటల్ హాస్పిటల్'ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

స్థానికంగానే నాణ్యమైన వైద్య సేవలు

ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మహబూబ్ నగర్ నగరంలో వివిధ రకాల ఆధునిక, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తుండటం శుభపరిణామమని పేర్కొన్నారు. గతంలో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం నగరంలోనే ఆధునిక వైద్య సదుపాయాలు పెరుగుతుండటంతో ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని తెలిపారు. స్థానికంగానే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉంటే రోగులకు ప్రయాణ ఖర్చులు, సమయం ఆదా అవుతాయని, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వైద్య సహాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

రోగుల ఆరోగ్యమే ప్రాధాన్యం కావాలి

దంత సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని చిరునవ్వు డెంటల్ హాస్పిటల్ నిర్వాహకులకు సూచించారు. వైద్య రంగంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, రోగులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్‌ను మెరుగైన వైద్య సేవలకు కేంద్రంగా అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ చర్యలతో పాటు ప్రైవేటు వైద్య సంస్థల భాగస్వామ్యం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. నగరంలో మరిన్ని వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం ప్రజారోగ్య పరిరక్షణకు, ప్రాంత అభివృద్ధికి దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రమాదేవి శ్రీనివాస్, ఇతర ప్రముఖులు, ఆసుపత్రి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఖేత్ బచావో అభియాన్ అవగాహన కార్యక్రమం

- మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని

వంగూర్ అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి)
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలం డిండి చింతపల్లి గ్రామంలో ఈరోజు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో లిఖేత్ బచావో అభియాన్‌లి అవగాహన కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపట్టాలని సూచించారు. తక్కువ నీటితో పండే పంటల ఎంపిక, నేలలో తేమ సంరక్షణ, విత్తన శుద్ధి, నీటి పొదుపు పద్ధతులు, సమగ్ర చీడపీడల యాజమాన్యం మరియు వాతావరణ సూచనలకు అనుగుణంగా సాగు చేయడం,వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామ్ భీష్మ, ఉప సర్పంచ్ జి. సత్యం, ఏఈఓ ప్రేమ్ కుమార్, బీటీఎం సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ రెడ్డి మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

భూ హద్దులపై స్పష్టతే లక్ష్యం.. ఆధునిక సాంకేతికతతో రీ-సర్వే.!

- జన్నప్పపల్లి భూ సర్వేపై బొక్కలోనిపల్లిలో గ్రామసభ

- భూయజమానులకు ఎల్‌పీఎం మ్యాపులు, భూధార్ కార్డులు : అదనపు కలెక్టర్ హరిప్రియ

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):
భూముల కొలతల్లో కచ్చితత్వాన్ని పెంచి, భూహద్దులపై స్పష్టత తీసుకురావడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలను నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న భూ రీ-సర్వే ప్రక్రియకు గ్రామస్థులు సహకరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూముల సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించనున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ గ్రామీణ మండలంలోని బొక్కలోనిపల్లి గ్రామంలో జన్నప్పపల్లి గ్రామానికి సంబంధించి చేపడుతున్న భూ సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన గ్రామసభలో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీ-సర్వే చేపడుతున్నట్లు వివరించారు.

రోవర్ సాంకేతికతతో కచ్చితమైన కొలతలు

భూముల కొలతలను కచ్చితంగా నిర్వహించి, భూహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు ఆధునిక రోవర్ సర్వే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు హరిప్రియ తెలిపారు. ఈ విధానం ద్వారా భూములకు సంబంధించిన వివరాలను మరింత కచ్చితత్వంతో నమోదు చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఎల్‌పీఎం మ్యాపులు, భూధార్ కార్డుల జారీ

భూ రీ-సర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూయజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్, భూధార్ కార్డులు జారీ చేయనున్నట్లు అదనపు కలెక్టర్ వెల్లడించారు. ఈ ప్రక్రియతో భూ రికార్డుల నిర్వహణలో కచ్చితత్వం పెరగడంతో పాటు భూముల సరిహద్దులపై స్పష్టత ఏర్పడుతుందని తెలిపారు. భూ యాజమాన్యం, భూహద్దులకు సంబంధించిన సమస్యలు, వివాదాలను భవిష్యత్తులో నివారించేందుకు రీ-సర్వే దోహదపడుతుందని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియకు సంబంధించి గ్రామస్థులకు అవసరమైన వివరాలను తెలియజేస్తూ, వారి సందేహాలను నివృత్తి చేయడం ద్వారా కార్యక్రమాన్ని సజావుగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.

సర్వే బృందాలకు సహకరించాలి

భూ రీ-సర్వే ప్రక్రియ సమర్థవంతంగా పూర్తయ్యేందుకు గ్రామస్థులు రెవెన్యూ, సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ కోరారు. భూములకు సంబంధించిన వివరాలపై అవగాహన కలిగి ఉండాలని, సర్వే సమయంలో అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో కాంగ్రెస్‌కు మరింత బలం.. ప్రజల్లోకి సంక్షేమ పథకాలు.!

- మహబూబ్‌నగర్‌లో జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా సమీక్షా సమావేశం

- నవీన్ పెట్టెం ముఖ్య అతిథిగా.. నాగరాజు ఆధ్వర్యంలో సమావేశం

మహబూబ్‌నగర్,అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సోషల్ మీడియా ఛైర్మన్ నవీన్ పెట్టెం ముఖ్య అతిథిగా హాజరుకాగా, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అంగంపల్లి సంజీవ్ ముదిరాజ్ సమావేశంలో పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా కీలకం

పార్టీ బలోపేతంలో సోషల్ మీడియా పాత్ర, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడం, పార్టీ నాయకులు నిర్వహించే కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించడం వంటి అంశాలపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సోషల్ మీడియా ఛైర్మన్ నవీన్ పెట్టెం మాట్లాడుతూ, సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆధునిక సమాచార మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పార్టీ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు, పార్టీకి మధ్య సోషల్ మీడియా వారధిగా నిలవాలని, ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ విజయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని పేర్కొన్నారు. జిల్లా సోషల్ మీడియా విభాగం మరింత చురుగ్గా పనిచేస్తూ పార్టీ కార్యకలాపాలకు డిజిటల్ వేదికల ద్వారా ప్రచారం కల్పించాలని నాయకులు సూచించారు. ఈ సమావేశానికి టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర సమన్వయకర్త ఫరీదుద్దీన్, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి నాగరాజు, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంత్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసుల రాజు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్, సీనియర్ నాయకుడు, మాజీ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు జై చంద్రశేఖర్, జవహర్ బాల్ మంచ్ జిల్లా చైర్మన్ ఎన్. సుదర్శన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. కలీం, చర్ల శ్రీనివాస్, బూరెమోని చందు యాదవ్, బాసిద్, వినయ్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా బృందం సభ్యులు హాజరయ్యారు.

పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం.!

- ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో

డీసీసీ అధ్యక్షుడు అంగంపల్లి సంజీవ్ ముదిరాజ్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు అంగంపల్లి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీ వడ్డెర బస్తీలో లబ్ధిదారులు కొమిరె చెన్నమ్మ, శంకర్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన చెన్నమ్మ, శంకర్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వారు తమ కుటుంబంతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అనంతరం సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. సొంత ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబం జీవితకాల స్వప్నమని, ఆ కల నెరవేరినప్పుడు ఆ కుటుంబంలో కలిగే ఆనందం వెలకట్టలేనిదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతో పాటు సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు నివాస భద్రత కల్పించడంతో పాటు, వారి భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచుతుందని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. కలీమ్, బూరెమోని చందు యాదవ్, అబ్రార్ హుస్సేన్, తిరుపతి నాయక్, రాజేష్ ముదిరాజ్, కాజా నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎం రహత్' భరోసా.!

- రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం.. 7 రోజుల వరకు చికిత్స

- మహబూబ్‌నగర్ జిల్లాలో 15 ఆసుపత్రుల్లో సేవలు.. ప్రజలకు జిల్లా ఎస్పీ జానకి పిలుపు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సకాలంలో వైద్య చికిత్స అందించి విలువైన ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రహత్ పథకంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి సూచించారు. ఈ పథకం ద్వారా అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులు నిబంధనల ప్రకారం రూ.1.5 లక్షల వరకు, గరిష్ఠంగా ఏడు రోజులపాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని తెలిపారు. జిల్లాలోని 15 ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రమాద బాధితులకు తక్షణ సాయం అందించాలి

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి, అత్యవసర వైద్య సేవలు అందేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. ప్రమాద బాధితులకు సహాయం చేసేందుకు ప్రజలు వెనుకాడకుండా మానవతా దృక్పథంతో ముందుకు రావాలని, సకాలంలో అందించే వైద్య సహాయం ఒక విలువైన ప్రాణాన్ని కాపాడగలదని పేర్కొన్నారు.

రోడ్డు భద్రతే ప్రాణరక్షణకు మార్గం

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని, బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌తో తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని పిలుపునిచ్చారు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు.!

- నేర నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి: ఎస్పీ జానకి

- జడ్చర్ల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో):

పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యాన్ని నివారిస్తూ, నేర నియంత్రణకు ప్రాధాన్యతనివ్వాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి, పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం జడ్చర్ల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు రికార్డులు, తీవ్రమైన నేరాల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు.

దర్యాప్తులో నాణ్యతే కీలకం

సర్కిల్ కార్యాలయంలోని ముఖ్యమైన రికార్డులు, రిజిస్టర్లు, కేసు డైరీలు, క్రైమ్ రికార్డులు, కోర్టు కేసులు, వారెంట్లు, సీసీటీఎన్ఎస్ ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించిన ఎస్పీ.. వాటిని ఎప్పటికప్పుడు నవీకరించాలని అధికారులకు సూచించారు. కేసుల దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాలు, కీలక సాక్ష్యాలను సమర్థవంతంగా సేకరించాలని, నిర్ణీత సమయంలో దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. నేరస్థులకు చట్ట ప్రకారం శిక్షలు పడేలా కోర్టు కేసుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులను తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, వాటి పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు.

నేరాల నివారణపై నిరంతర నిఘా..

సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరస్థులపై నిఘా, రౌడీషీటర్ల పర్యవేక్షణ, వారెంట్ల అమలు, బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఎస్పీ సూచించారు. మహిళలు, బాలల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తన పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, సిబ్బందికి తగిన మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతోపాటు, ప్రజలతో సమన్వయంగా పనిచేసి పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని పేర్కొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణ స్పందన

ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ప్రతి ఫిర్యాదుపై తగిన విధంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ సూచించారు. పోలీసు సేవల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, సిబ్బంది క్రమశిక్షణ, విధి నిర్వహణతోపాటు సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ వార్షిక తనిఖీ ద్వారా జడ్చర్ల రూరల్ సర్కిల్ పరిధిలో పోలీసు వ్యవస్థ పనితీరును సమీక్షించి, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, జడ్చర్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఎస్పీ సీసీ రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన డి.ఎఫ్.సి.ఎస్ పోరాటం బాషమోని శ్యామ్ కుటుంబానికి అందిన ఆర్థిక సాయం

నాగర్ కర్నూల్ : అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి)

కల్వకుర్తి తాలూకా ఊరుకొండ మండలము రేవెల్లి సొసైటీ సభ్యుడు భాషమోని శ్యామ్ ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో మరణించడంతో శ్యామ్ కుటుంబానికి పరిహారం ఇప్పించేందుకు నాగర్ కర్నూలు జిల్లా మత్స్యశాఖ కల్వకుర్తి పట్టణం నడి బొడ్డున చేసిన పోరాటం ఫలించింది.శ్యామ్ కుటుంబానికి శ్రీనివాస్ రెడ్డి 15 లక్షల రూపాయలు నష్టపరిహారం కింద ఇస్తానని ఒప్పుకుని ఏడున్నర లక్షలు చెల్లించడం జరిగింది.మరో 75 వేల రూపాయలు నాలుగు నెలల సమయానికి ఇస్తానని రాత పూర్వకంగా ఒప్పుకోవడం జరిగింది.జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు, జిల్లా డైరెక్టర్లు వేమ బజారు మంజుల,రాముడు, తెప్ప బాబు శ్యామ్ కుటుంబాన్ని పరామర్శించి నలుగురు కూతుర్ల చదువుల కోసం సహాపడతామని ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగింది.

మౌనమేల నోయి...
కాంగ్రెస్ పెద్దల మౌనంలో మతలబేంటి..!?

- సొంత పార్టీ ఎమ్మెల్యేపై రాఘవేంద్ర రాజు తిరుగుబాటు... యెన్నం మౌనం వెనుక వ్యూహమేమిటి..?
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిపై ఆరోపణలు.. బీజేపీ కోవర్ట్ అంటూ రాఘవేంద్ర రాజు విమర్శలు.. అయినా స్పందించని రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ నాయకత్వం.!
- మహబూబ్‌నగర్ రాజకీయాల్లో అంతుచిక్కని మౌనం..

రాఘవేంద్ర రాజుకు తెరవెనుక పార్టీ మద్దతు ఉందా.? లేక అధిష్ఠానం ఆలోచనాత్మక మౌనాన్ని పాటిస్తోందా.?

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో): “మౌనమేల నోయి... ఈ మరపురాని...” అనే పాట గుర్తుకొస్తోంది మహబూబ్‌నగర్ రాజకీయ పరిణామాలను చూస్తుంటే.! అయితే ఇక్కడ మౌనం పాటిస్తున్నది 'ప్రేమికులు కాదు.. అధికార కాంగ్రెస్ పార్టీలోని ముఖ్య నాయకులు'. ప్రశ్నలు సంధిస్తున్నది ప్రతిపక్షం కాదు.. సొంత పార్టీకి చెందిన నాయకుడు 'పాపరాజు పుత్రుడు '.! ఆరోపణలు ఎదుర్కొంటున్నది సాధారణ కార్యకర్త కాదు.. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి.! అయినా పార్టీ పెద్దల పెదవులు ఎందుకు కదలడం లేదు.? ఈ మౌనం వెనుక ఏమైనా రాజకీయ లెక్కలున్నాయా.? లేక పార్టీ అంతర్గతంగా ఏదైనా వ్యూహం నడుస్తోందా.?మహబూబ్‌నగర్ రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన ప్రశ్న ఇదే..!

సొంత పార్టీ ఎమ్మెల్యేపైనే తిరుగుబాటు బావుటా.!

చలువ గాలి రాఘవేంద్ర రాజు చేస్తున్న విమర్శలు, ఆరోపణలు స్థానిక రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. ముఖ్యంగా ఓటరు నమోదు, ఓటు హక్కు పరిరక్షణకు సంబంధించిన అంశాలపై ఆయన చేస్తున్న పోరాటం ఇప్పుడు పార్టీ అంతర్గత వ్యవహారంగా కూడా చర్చకు వస్తోంది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిపై రాఘవేంద్ర రాజు చేస్తున్న ఆరోపణలు సాధారణ రాజకీయ విమర్శల స్థాయిని దాటి, పార్టీ నాయకత్వం సమాధానం చెప్పాల్సిన అంశాలుగా మారుతున్నాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.ఒకవైపు ఎమ్మెల్యే.. మరోవైపు అదే పార్టీకి చెందిన నాయకుడు.! ఇద్దరూ ఒక్కగూటి పక్షులే..కాంగ్రెస్ రాజకీయ పరిధిలోనే ఉన్నప్పుడు, ఇలాంటి వివాదంపై పార్టీ నాయకత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించకపోవడం ఎందుకు.? రాఘవేంద్ర రాజు ఆరోపణల్లో వాస్తవం లేదని పార్టీ భావిస్తే ఆ విషయాన్ని బహిరంగంగా ఎందుకు చెప్పడం లేదు.? ఆరోపణలకు ఆధారాలున్నాయని భావిస్తే “క్రమశిక్షణ కమిటీ” విచారణకు ఎందుకు ఆదేశించడం లేదు.?ఆరోపణలు నిజమో కాదో తేల్చాల్సింది విచారణ.. కానీ విచారణ జరగాలనే డిమాండ్‌కు సమాధానం చెప్పాల్సింది మాత్రం పార్టీ నాయకత్వమే.!

“బీజేపీ కోవర్ట్” ఆరోపణ.. యెన్నం సమాధానమేది.?

రాఘవేంద్ర రాజు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని బీజేపీ కోవర్ట్‌గా అభివర్ణిస్తూ చేస్తున్న ఆరోపణలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసే అంశం. అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ఇలాంటి ఆరోపణలు వస్తున్నప్పుడు, వాటిని తేలికగా కొట్టిపారేయడం ఎంతవరకు సమంజసం.? అదే సమయంలో, ఆధారాలు లేకుండా ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించడం కూడా సమంజసం కాదు. అందుకే అసలు ప్రశ్న యెన్నం బీజేపీ కోవర్టా కాదా అన్నది కాదు. ఆ ఆరోపణలకు రాఘవేంద్ర రాజు చూపిస్తున్న ఆధారాలేమిటి.? వాటిపై ఎమ్మెల్యే వివరణ ఏమిటి.? పార్టీ నాయకత్వం విచారణకు సిద్ధంగా ఉందా.? అన్నదే కీలకం.యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పందించి ఆరోపణలకు స్పష్టత ఇస్తే ప్రజల్లో నెలకొన్న సందేహాలకు సమాధానం లభిస్తుంది. ఆరోపణలు నిరాధారమైతే వాటిని ఆధారాలతో ఖండించే అవకాశం కూడా ఆయనకుంది. మరి ఈ రాజకీయ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మౌనం కొనసాగితే, అనుమానాలకు మరింత ఆస్కారం కల్పించినట్లవదా.? (మౌనం అర్థాంగీకారమా..!?)

రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ మౌనం.. వ్యూహమా.? నిర్లక్ష్యమా.?

ఒక రాజకీయ పార్టీలో క్రమశిక్షణ, సమన్వయం అత్యంత కీలకం. సొంత పార్టీ ఎమ్మెల్యేపై అదే పార్టీకి చెందిన నాయకుడు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నప్పుడు, పార్టీ నాయకత్వం కనీసం వివరణ కోరడం, వాస్తవాలను పరిశీలించడం, అవసరమైతే అంతర్గత విచారణ జరిపించడం సహజమైన బాధ్యత. కానీ మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీలో కనిపిస్తున్న ఈ మౌనంపై రాజకీయ పరిశీలకుల్లో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి ఈ వివాదం తెలిసి కూడా స్పందించడం లేదా.? జిల్లా కాంగ్రెస్ నాయకత్వం ఈ వ్యవహారాన్ని అంతర్గత సమస్యగా భావించి పక్కన పెడుతోందా.? లేక రాఘవేంద్ర రాజు చేస్తున్న పోరాటాన్ని పార్టీ పెద్దలు నిశ్శబ్దంగా గమనిస్తున్నారా.? ఇవి సమాధానాలు లేని ప్రశ్నలు మాత్రమే. వీటిని బట్టి పార్టీ అధిష్ఠానం రాఘవేంద్ర రాజుకు మద్దతు ఇస్తోందని నిర్ధారించలేం. అయితే, ఆయన ఆరోపణలపై పార్టీ మౌనం కొనసాగుతున్న కొద్దీ, తెరవెనుక రాజకీయ సమీకరణాలున్నాయా అన్న సందేహాలకు మాత్రం అవకాశం పెరుగుతోంది. పార్టీ పెద్దలు నిజంగా తటస్థంగా ఉంటే, తమ వైఖరిని స్పష్టం చేయాల్సిన అవసరం లేదా.? ఎమ్మెల్యేకు మద్దతు ఇస్తున్నా, రాఘవేంద్ర రాజు వాదనను పరిశీలిస్తున్నా, రెండింటిలో ఏది చేస్తున్నారో కార్యకర్తలకు తెలియజేయాల్సిన బాధ్యత లేదా..?

రాఘవేంద్ర రాజు వెనుక ఎవరున్నారు.?

పోరాటమా.. రాజకీయ వ్యూహమా.?

సాధారణంగా అధికార పార్టీలోని ఒక నాయకుడు తన సొంత పార్టీ ఎమ్మెల్యేపై ఇంత బహిరంగంగా విమర్శలు చేస్తే, పార్టీ క్రమశిక్షణ వ్యవస్థ స్పందించే అవకాశం ఉంటుంది. అలాంటిది రాఘవేంద్ర రాజు తన విమర్శలను కొనసాగిస్తున్న నేపథ్యంలో మరో ప్రశ్న ముందుకొస్తోంది. ఆయన కేవలం ఓటు హక్కు పరిరక్షణ అంశంపైనే పోరాడుతున్నారా.? లేక ఈ పోరాటం ద్వారా పార్టీ అంతర్గత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంటున్నారా.? రాష్ట్ర, జిల్లా స్థాయిలోని కొందరు నాయకులు ఆయన వాదనలతో ఏకీభవిస్తున్నారా.? లేదా ఆయన స్వతంత్రంగా తన రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తున్నారా.?ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా ఈ ప్రశ్నలకు ఖచ్చితమైన సమాధానం చెప్పలేం. రాఘవేంద్ర రాజుకు పార్టీ పెద్దల నుంచి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మద్దతు ఉందని నిర్ధారించే ఆధారాలు బహిరంగంగా వెల్లడైతేనే ఈ అనుమానాలకు స్పష్టత వస్తుంది.అయితే ఒక విషయం మాత్రం స్పష్టం: ఆయన లేవనెత్తుతున్న అంశాలకు పార్టీ నాయకత్వం స్పందించకపోవడం వల్ల, ఈ పోరాటం వెనుక రాజకీయ వ్యూహముందా అన్న చర్చకు తెరలేస్తోంది.

ఓటు హక్కు అంశం.. రాజకీయాలకు అతీతంగా తేలాల్సిందే.!

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. ఓటరు జాబితాలో ఒక వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైందన్న ఆరోపణ వచ్చినా, అది ఎవరికి సంబంధించినదైనా, నిబంధనల ప్రకారం పరిశీలించాల్సిందే. అయితే ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం, వాస్తవంగా ఒకటి కంటే ఎక్కువసార్లు ఓటు వేయడం రెండూ ఒకటే కావు. సంబంధిత రికార్డులు, వర్తించే ఎన్నికల చట్టాలు, అధికారిక విచారణ ఆధారంగానే తుది నిర్ధారణ జరగాలి.అందువల్ల యెన్నం శ్రీనివాస్ రెడ్డిపై వస్తున్న ఓటరు నమోదు సంబంధిత ఆరోపణలపైనా, రాఘవేంద్ర రాజు చేస్తున్న విమర్శలపైనా సంబంధిత ఎన్నికల అధికారులు నిష్పక్షపాతంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలి. ఆరోపణలు నిజమైతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. నిరాధారమైతే ఆ విషయాన్ని కూడా స్పష్టంగా ప్రకటించాలి. రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ఒక న్యాయం, సాధారణ పౌరులకు మరో న్యాయం అన్న భావన ప్రజల్లో కలగకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉంది.

కాంగ్రెస్‌కు ఇది పరీక్షా సమయం.!

మహబూబ్‌నగర్‌లో జరుగుతున్న పరిణామాలు కేవలం యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రాఘవేంద్ర రాజుల మధ్య వివాదంగా మాత్రమే మిగిలిపోవు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ పార్టీ ఎలా ఎదుర్కొంటుందన్నది కూడా ప్రజల్లో పార్టీ విశ్వసనీయతను ప్రభావితం చేయవచ్చు. తన ఎమ్మెల్యేపై ఆరోపణలు వస్తే పార్టీ ఆయనకు అండగా నిలవాలా.? లేక ఆరోపణలపై విచారణకు సహకరించాలా.? రెండింటికీ మధ్య విరోధం లేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి తన వాదన వినిపించే అవకాశం కల్పిస్తూనే, నిజానిజాలను నిష్పక్షపాతంగా తేల్చవచ్చు.అదే సమయంలో, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్నానని చెబుతున్న పార్టీ నాయకుడి వాదనలను కూడా పరిశీలించవచ్చు. క్రమశిక్షణ పేరుతో ప్రశ్నలను అణచివేయడం ఎంత తప్పో, ఆరోపణల పేరుతో తీర్పులు ఇవ్వడం కూడా అంతే తప్పు. కాంగ్రెస్ నాయకత్వం ఈ వివాదాన్ని స్పష్టమైన విధానంతో పరిష్కరిస్తే, అది పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యానికి నిదర్శనమవుతుంది. లేదంటే, ఈ మౌనం మరిన్ని రాజకీయ సందేహాలకు తావివ్వవచ్చు.

మౌనం వీడితేనే మతలబు బయటపడుతుంది.!

“మౌనమేల నోయి...” అంటూ పాటను గుర్తుచేసుకోవడం సులభమే. కానీ ప్రజా జీవితంలో ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా మౌనం వహించడం మాత్రం అంత సులభంగా సమర్థించుకోలేని విషయం. యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పందించాలి. రాఘవేంద్ర రాజు తన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుంచాలి. రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ నాయకత్వం తన వైఖరిని స్పష్టం చేయాలి. సంబంధిత ఎన్నికల అధికారులు చట్టప్రకారం వాస్తవాలను తేల్చాలి. రాఘవేంద్ర రాజుకు పార్టీ పెద్దల అండ ఉందా.? ఆయన పోరాటం వెనుక వ్యూహముందా.? యెన్నం మౌనం రాజకీయ లెక్కలా.? కాంగ్రెస్ నాయకత్వం మౌనం వ్యూహాత్మకమా, లేక సమస్యను పట్టించుకోకపోవడమా.? ఈ ప్రశ్నలకు ఇప్పటికిప్పుడు ఊహాగానాలే సమాధానాలు కావు. సంబంధిత నాయకుల స్పందనలు, ఆధారాలు, అధికారిక చర్యలే అసలు నిజాన్ని బయటపెట్టాలి.

అప్పటివరకు మహబూబ్‌నగర్ రాజకీయాల్లో మారుమోగే ప్రశ్న ఒక్కటే...

“మౌనమేల నోయి... కాంగ్రెస్ పెద్దలారా, సమాధానం చెప్పరా?”